పటాన్‌చెరు: సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

సంక్రాంతి సంబురాలు

పటాన్‌చెరు, జనవరి 9: విద్యార్థులు సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. గురువారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలోని నారాయణ విద్యాసంస్థ విద్యార్థినులు సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఎదుట ఉత్సాహంగా ముగ్గులు వేశారు. ప్రిన్సిపాల్ సాయిశ్రీ మాట్లాడుతూ..పండుగలు భారతీయ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయన్నారు. అన్ని పండుగలు, సాంస్కృతిక, సంప్రదాయాలను గౌరవించి నారాయణ విద్యాసంస్థలు పెద్దపీట వేస్తాయన్నారు. చదువుతో పాటు మన సంప్రదాయాలు భావితరాలకు పరిచయం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జ్యోతి, శ్రీలత, శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు

ఆర్వో నర్సింహులుకు వినతిపత్రం అందజేస్తున్న బీరప్ప బస్తీ మహిళలు

జిన్నారం(బొల్లారం) జనవరి 9: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్పబస్తీలో అభివృద్ధి పనులను స్థానిక నాయకులు అడ్డుకుంటున్నారని మాజీ వార్డు సభ్యురాలు శారద అన్నారు. ఈ మేరకు కాలనీ మహిళలతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో నర్సింహులును కలిసి ఫిర్యాదు చేశారు. కాలనీలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను స్థానిక నాయకులు అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. పనులు నిలిచిపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై కమిషనర్ మంగతాయారు స్పందిస్తూ.. కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించి తీర్మానించిన అభివృద్ధి పనులను పూర్తి చేసిన తర్వాత స్థానికులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని, బొల్లారం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో బీరప్ప బస్తీ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్‌తో తారా ఒప్పందం

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రత్నప్రసాద్, అన్నమయ్య

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 9: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్‌తో స్థానిక తారా ప్రభుత్వ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ మేరకు గురువారం తారా ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీఎస్ రత్నప్రసాద్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తారా కళాశాల ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ విజయ, ఏవో కామరాజు, అధ్యాపకులు డాక్టర్ విజయ, డాక్టర్ సరోజినీచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తారా విద్యార్థులు

తారా కళాశాల రసాయన విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌ను విద్యార్థులు సందర్శించారు. ల్యాబ్స్‌లో జరుగుతున్న రసాయన పరీక్షలు, ఉత్పత్తి తీరును ల్యాబ్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వల్లి సౌభాగ్యం, అధ్యాపకులు డాక్టర్ వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ముస్తాబైన వైకుంఠపురం

నేడు ఉత్తరద్వార దర్శనం

- వైకుంఠపురంలో ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 9: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారా దర్శనం కోసం వైకుంఠపురంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని సర్వాంగసుందరగా అలంకరించారు. గురువారం సాయంత్రం బండ్ల ఊరేగింపు కోలాహంగా జరిగింది. ఉత్తర ద్వార దర్శనానికి దాదాపు లక్షన్నర మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని ఆలయ ప్రధాన అర్చకులు వెల్లడించారు.

లైబ్రరీకి పుస్తకాలు అందజేసిన ఉపాధ్యాయురాలు

పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన ఉపాధ్యాయురాలు మానసరెడ్డి

జహీరాబాద్, జనవరి 9: న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సౌకర్యార్థం లైబ్రరీకి పుస్తకాలు అందజేశారు. 2024లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా నియమితులైన మానసరెడ్డి తన మొదటి నెల జీతం డబ్బుల నుంచి రేజింతల్, మిర్జాపూర్(బి) పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో మారుతీరాథోడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు స్టడీ మెటీరియల్, లైబ్రరీలో పుస్తకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం రాజ్‌కుమార్, హెచ్ఎంలు గురునాథ్, సఫియాసుల్తానా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


మాట్లాడుతున్న ఇంపాక్ట్ ట్రైనర్ పట్లోళ్ల సంగీతాపాటిల్

ఝరాసంగం, జనవరి 9: విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను, దేశాన్ని గౌరవిస్తూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థానాలకు ఎదగాలని ఇంపాక్ట్ ట్రైనర్(లెక్చరర్) పట్లోళ్ల సంగీతాపాటిల్ అన్నారు. గురువారం మండలంలోని కుప్పానగర్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొన్న తర్వాత సమయాన్ని వృథా చేయకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శాంతకుమార్, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, కరుణాకర్‌రావు, రమేశ్, ఇమ్మానుయేల్, అనిత, రాధిక, జయశ్రీ, సుగుణ, కరుణజ్యోతి, ఉత్తమ్‌కౌర్, నర్సింహులు, సిద్దన్నపాటిల్ పాల్గొన్నారు.

మరో 'పంచాయతీ'కి సన్నాహాలు!

మల్కన్‌పాడ్‌ను పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు నివేదకలు సిద్ధం చేసిన అధికారులు

- ఎన్నికల నోటిఫికేషన్ ముందే పంచాయతీగా ప్రకటించే అవకాశం

మల్కన్‌పాడ్ గ్రామ వ్యూ

జహీరాబాద్, జనవరి 9: సంగారెడ్డి జిల్లాలో అతిపెద్ద మండలంగా ఉన్న న్యాల్‌కల్ మండలంలో మరో గ్రామ పంచాయతీ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామీణులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన పంచాయతీ ఏర్పాటుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే న్యాల్‌కల్ మండలంలో 37 గ్రామ పంచాయతీలుండగా, గతేడాది టేకూర్ పంచాయతీ పరిధిలోని తాట్‌పల్లిని కొత్తగా ఏర్పాటు చేశారు. తాజాగా మల్కన్‌పాడ్‌ను పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీకి కిలోమీటర్ దూరం వరకు విస్తరించి ఉంటే, జనాభా 500 ఉంటే, అందులోని వీలిన గ్రామాలను విభజించి నూతన పంచాయతీ ఏర్పాటుకు పూనుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మండలంలోని హద్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కన్‌పాడ్‌ను నూతన పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు. మల్కన్‌పాడ్ గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 223 మంది పురుషులు, 231 మంది స్త్రీలు కలిపి 454 మంది ఉన్నారు. అందులో ఓటర్లు 133 మంది పురుషులు, 165 మంది స్త్రీలు ఉన్నారు. గ్రామంలో 315 ఎకరాల పట్టా భూమి, 17.09 ఎకరాల ప్రభుత్వ భూమి, 19.30 ఎకరాల ఇనాం భూమి, 4.34 ఎకరాల రోడ్లు, 4.00 ఎకరాల గ్రామ కంఠం భూమి కలిపి మొత్తం 361.32 ఎకరాల విస్తీర్ణం ఉంది. హద్నూర్ పంచాయతీ పరిధిలోని ఒక వార్డును నూతనంగా ఏర్పాటయ్యే మల్కన్‌పాడ్‌లో కలిపే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అధికారులు పంచాయతీ ఏర్పాటుకు నివేదికలు ఉన్నతాధికారులకు అందజేశారు. 38 గ్రామ పంచాయతీలున్న న్యాల్‌కల్ మండలం మల్కన్‌పాడ్ ఏర్పాటైతే జిల్లాలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీలు ఉన్న మండలంగా నిలువనుంది. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రకటించే అవకాశాలు ఉన్నాయని సంబంధిత శాఖాధికారులు, వివిధ పార్టీల నాయకులు పేర్కొంటున్నారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

హత్నూర, జనవరి 9: హత్నూర మండలం శేర్ఖాన్‌పల్లి పలుగు పోచమ్మ ఆలయ నూతన పాలకవర్గం సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నూతన పాలకవర్గం సభ్యులను నియమించడంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గం చైర్మన్‌గా మల్లాగౌడ్, ధర్మకర్తలుగా దశరథ, లక్ష్మణ్ గౌడ్, శంకరయ్య, స్వరూప, స్వామితోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడుగా ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఈవో దేవనాదం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టు ఆల్ టోర్నమెంట్

- గుమ్మడిదలలో ఏర్పాట్లు పూర్తి చేసిన సీజీఆర్ ట్రస్ట్ సభ్యులు
- క్రీడోత్సవాలను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదలలో ఓపెన్ టు ఆల్ టోర్నమెంట్ నిర్వహించే స్థలం

గుమ్మడిదల, జనవరి 9: గుమ్మడిదలలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నుంచి ఓపెన్ టు ఆల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మండలకేంద్రంలో జాతీయస్థాయిలో ఓపన్ టు ఆల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని, క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. 10 వతేదీ నుంచి 12వ తేదీ వరకు క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నూతన విగ్రహ ఆవిష్కరణ, అనంతరం క్రీడల్లో విజయం సాధించిన కబడ్డీ, వాలీబాల్ ప్రథమ జట్టుకు రూ.50 వేలు నగదు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు నగదు, తృతీయ బహుమతి రూ.15 వేల నగదుతో పాటు టోఫీ, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడోత్సవాలకు ఆటా స్థలాన్ని ముస్తాబు చేసినట్లు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హఫీజ్

ఝరాసంగం, జనవరి 9: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని, క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని మాజీ ఎంపీటీసీ షేక్ హఫీజ్ పహల్వన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ వీరమని సంగారెడ్డి, మండల నాయకులు భద్రరెడ్డి, అశ్విన్‌పటేల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మేనేజ్‌మెంట్ మోయిజ్, శ్రీకాంత్, సలీం, ఆర్గనైజర్లు దత్తు, శ్రీను, రామ్‌రెడ్డి, హుస్సేన్, మహమ్మద్, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

జహీరాబాద్, జనవరి 9: అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను జిల్లా ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బృందం గురువారం అరెస్టు చేసింది. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారి కమలాహసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఎక్సైజ్ అధికారులు హనుమంతు, రమేశ్‌తో కూడిన ప్రత్యేక బృందం బుధవారం గోవాకు వెళ్లింది. అక్కడ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని థార్ జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్ ఆరీఫ్‌ఖాన్‌ను గోవా పోలీసుల సహకారంతో అరెస్టు చేసింది. 2014-15లో రాష్ట్రంలోని చేవేళ్ల, శంషాబాద్, కుత్బుల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆరీఫ్‌ఖాన్‌పై కేసులు నమోదైయ్యాయని జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అప్పట్లో నాలుగు లోడ్ల నాన్ డ్యూటీ పేడ్ మద్యాన్ని తీసుకువచ్చినందుకు స్మగ్లర్ ఆరీఫ్‌ఖాన్‌పై 2016లో కేసు నమోదైందన్నారు. శంషాబాద్‌లో ఆతడిపై పీడీయాక్టు ఉందన్నారు. అప్పటి నుంచి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో ప్రత్యేక బృందం గోవా వెళ్లి ఆరీఫ్‌ఖాన్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

గుమ్మడిదల, జనవరి 9: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. బుధవారం నల్లవల్లి శివారులోని 272 సర్వే నంబర్ భూముల్లో వ్యాపారులు పట్టపగలు దర్జాగా టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారని 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన 'ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి రవాణా' కథనానికి స్పందించారు. అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌కు రూ.10 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ గంగాభవాని, నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఉద్యోగి ప్రజలతో మమేకమవ్వాలి

నర్సింహులును సన్మానిస్తున్న ఎస్ఐ నారాయణ

రాయికోడ్, జనవరి 9: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమేనని ఎస్ఐ నారాయణ అన్నారు. గురువారం రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహులు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణ మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రజలతో మమేకమై, చట్టాల పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. సమావేశంలో పీఎస్ఐ జాన్ వెస్లీ, సిబ్బంది సంగారెడ్డి, తుకారం తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జిన్నారం(బొల్లారం) జనవరి 9: బొల్లారం మున్సిపల్ పాలకవర్గ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ తాత్కాలిక కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ మంగతాయారు గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

చిన్నారికి ఆర్థిక సాయం అందజేస్తున్న అబ్దుల్ ఖాదీర్

రామచంద్రాపురం, జనవరి 9: చిన్నారి వైద్యానికి ఏకే ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉంటున్న గీత(12) అనాథ. ఆ బాలిక తలసేమియా వ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ ఖాదీర్ ఆ బాలిక వైద్యం కోసం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తలసేమియా వ్యాధి నుంచి ఆ బాలిక త్వరగా కోలుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని ఆకాంక్షించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఝరాసంగం, జనవరి 9: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 100 సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేశామని పాఠశాల ప్రిన్సిపాల్ తేనావతి తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్, ప్రజాప్రతినిధులు

అందోల్, జనవరి 9: అందోల్ మండలంతోపాటు అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం అందజేశారు. అందోల్ తహసీల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్యతో కలిసి తహసీల్దార్ విష్ణుసాగర్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీటీ మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగరాజు, శివశంకర్, చందర్‌నాయక్, ప్రవీణ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బావిలోపడి యువకుడు మృతి

నారాయణఖేడ్, జనవరి 9: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన నారాయణఖేడ్ మండలం చాప్టా(కె)లో జరిగింది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమాకాంత్ కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన ఉమాకాంత్ గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికెళ్లి విచారణ అనంతరం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దగోపులారంలో కబడ్డీ పోటీలు

కబడ్డీ పోటీల కరపత్రం విడుదల చేస్తున్న డీఎస్పీ సత్యయ్య గౌడ్

మునిపల్లి, జనవరి 9: కబడ్డీ పోటీలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దగోపులారంలో ఈనెల 13న నిర్వహించనున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీల కరపత్రాన్ని గురువారం సంగారెడ్డిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులతో డీఎస్పీ మాట్లాడుతూ.. కబడ్డీ పోటీలను కలిసికట్టుగా క్రీడాస్ఫూర్తితో నిర్వహించాలని సూచించారు. అనంతరం కబడ్డీ టోర్నమెంట్ నిర్వాహకులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కొండాపూర్ సీఐ వెంకటేశం ఉన్నారు.

ఉత్తమ సేవలందించిన యువజనులకు అవార్డులు

స్వామి వివేకానంద అవార్డు అందుకున్న యువజన నాయకులు

గుమ్మడిదల, జనవరి 9: ఉత్తమ సేవలందించిన యువజనులకు స్వామి వివేకానంద రాష్ట్రస్థాయి అవార్డులు అందజేసినట్లు రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ తెలిపారు. గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజన సంఘాల నాయకులు, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గుమ్మడిదల, జిన్నారం మండలాల యువజన సంఘాల నాయకులు మంద భాస్కర్‌రెడ్డి, వీఎం.ఎల్లయ్య, మాజీ ప్రధానకార్యదర్శి యాదగిరి, జిన్నారం యువజన సంఘాల అధ్యక్షుడు ఆది రామకృష్ణతోపాటు వందలాది మంది యువజనులు పాల్గొన్నారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో 30 ఏండ్లుగా సేవలందించిన 50మంది యువజన నాయకులకు, గుమ్మడిదల అంబేద్కర్ యువజన సంఘానికి రాష్ట్రస్థాయిలో స్వామి వివేకానంద అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, నేటి యువత సమాజ సేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిన్నారం మండలాల యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కాసాల పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

హత్నూర, జనవరి 9: గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని డీపీవో సాయిబాబా అన్నారు. గురువారం హత్నూర మండలం కాసాల గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో సాయిబాబా మాట్లాడుతూ.. గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఆయన వెంట ఎంపీవో యూసుఫ్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

రేకుల షెడ్లు ధ్వంసం

రేకుల షెడ్లను ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులు

హత్నూర, జనవరి 9: హత్నూర మండలం శేర్ఖాన్‌పల్లి శివారు పలుగు పోచమ్మ ఆలయ సమీపంలోని అటవీ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను ఫారెస్ట్ అధికారులు గురువారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. గ్రామస్తులు కొందరు అటవీభూమిలో కొన్నేండ్ల క్రితం రేకుల షెడ్లు ఏర్పాటు చేసి దుకాణాలు నిర్వహిస్తుండగా, ఇటీవల మరిన్ని రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. రేకుల షెడ్ల కోసం అటవీ ప్రాంతంలోని వృక్షాలను నేలకూలుస్తూ, భూమిని చదును చేసి కొన్ని ఎకరాల్లో రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తుండటంతో అటవీ శాఖ అధికారులు వాటిని తొలిగించాలని నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వాటిని తొలిగించకపోవడంతో గురువారం డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శాహిని సిబ్బందితో అక్కడకు చేరుకొని జేసీబీల సహాయంతో రేకుల షెడ్లను ధ్వంసం చేశారు. మిగతా రేకుల షెడ్లను స్వచ్ఛందంగా తొలిగించుకోవాలని, లేనిపక్షంలో వాటిని త్వరలోనే తొలిగిస్తామని హెచ్చరించారు. అటవీ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా గోవర్ధన్

ఎన్నికైన పంచాయతీ కార్యదర్శులు సంఘం సభ్యులను సన్మానించిన అధికారులు

జహీరాబాద్, జనవరి 9: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా గోవర్ధన్ ఎన్నికైయ్యారు. గురువారం న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ధన్‌రాజ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా రేణుక, కోశాధికారిగా అరుణజ్యోతి, జాయింట్ కార్యదర్శులుగా రజినీకాంత్, అమూల్య, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంతోష్, ప్రచార కార్యదర్శిగా కిషన్‌రెడ్డి, సభ్యులుగా తిరుపతి, జైసింగ్, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున్, నర్సింహులును ఎన్నుకున్నారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్, పంచాయతీ అధికారి సురేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

పటాన్‌చెరులో సామాజిక తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

పటాన్‌చెరు, జనవరి 9: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. గురువారం పటాన్‌చెరు మండల కేంద్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీని ప్రత్యేక బృందం నిర్వహించింది. ఈ తనిఖీల్లో పలుచోట్ల సక్రమంగా జరగ్గా, కొన్నిచోట్ల చిన్నపాటి అవకతవకలు బయటపడ్డాయి. వాటిని సరిదిద్ది సొమ్మును రికవరీ చేయాలని తెలంగాణ రూరల్ డెవలప్‌మెంట్ ఎస్‌టీఎం అజయ్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ బాలు, అడిషనల్ పీడీ బాల్‌రాజ్, ఆడిట్ బృందం మండల బాధ్యులను కోరింది. ముత్తంగిలో జరిగిన పేమెంట్లలో తప్పులను గుర్తించారు. పేద, బడుగు వర్గాలకు ఉపాధి కల్పించేందుకు సిబ్బంది సరిగా పనిచేయడం లేదని బృందం పేర్కొంది. పటాన్‌చెరు మండలంలో పరిశ్రమల్లో, గృహ నిర్మాణ రంగంలో కూలీలకు డిమాండ్ ఉండడంతో కూలీలు ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవడం లేదని పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి అన్నారు. రూ. కోటి 14లక్షల పనులు మాత్రమే జరిగాయన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీలత, విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీవో హరిశంకర్ గౌడ్, కార్యదర్శులు రాజ్‌కుమార్, రాజేందర్, పద్మ, సుభాష్, అనిత, కవిత, రవికుమార్, నర్సింహారెడ్డి, నరేశ్, మౌనిక, రామకృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.